# 4

# కలియుగ ధర్మం

కృతయుగంలో-ఒకటో పాదంలో దుందుభి నామ సంవత్సర కార్తీకశుద్ధ త్రయోదశి ఉదయాన సుముహూర్తమందు శౌనకాది మహర్షులందరూ నిత్యకృత్యాలు తీర్చుకుని స్నానాలు చేసి వీభూది ధరించి దర్భాసనాలమీద సూతమహర్షి చుట్టూ చేరి కూచున్నారు. అప్పుడు శౌనకమహర్షి యేమన్నాడంటే ?

"గురువర్యా, కలికాలము, కలికాలము అంటారు. అప్పుడు ధర్మము ఒక పాదం మీదే నడుస్తుందంటారు. ఎంత ఆలోచించినా మాదృష్టికి ఆ విషయం గోచరం కావటం లేదు. అంతులేనిదీ, ఆత్మానందకరమైనదీ,సమస్త సౌభాగ్యకరమైనదీ ఐన యీ ఆధ్యాత్మిక సంపదను వొదిలి ప్రజలు విషయలోలులూ, ధర్మవిచ్ఛేదకులూ ఎలా కాగలరో మా మనస్సులకు గోచరము కావడము లేదు. తమరు మాకు విదితమయ్యేట్టు బోధ చెయ్యవలెనని కోరుకుంటున్నాము" అన్నారు.

అప్పుడు సూతమహర్షి యేమన్నాడంటే—

"నే నిదివరకు మీకు చెప్పినదానికన్న యేమి చెప్పగలను? కాని వొకటి చేస్తాను. నా యోగదృష్టి వల్ల భవిష్యత్తును చూసి వర్ణిస్తాను. అప్పుడు మీకు ఆ విషయం సులభంగా వ్యక్తమౌతుంది"

అని కళ్ళు మూసుకుని యోగనేత్రాన్ని తెరిచాడు. ఊపిరి బిగబట్టి, తన్మయులై, అందరు జడధారులూ ఆయనవదనారవిందమువైపు చూస్తున్నారు? మెల్లిగా పెదిమలు కదిలి యీ మాటలు ఆయన వాక్కునించి వినిపించాయి.

త్రేతాయుగము—ఊఁ—ద్వాపరం—ఆ—కలి—మొదటిపాదం. రక్తాక్షినామ సంవత్సరం, శ్రావణమాసం — కృష్ణపక్షం — ద్వాదశి — బుధవారం — జంబూద్వీపం — భరతవర్షం — భరత ఖండం—కృష్ణాకావేరీ మధ్యదేశం—తెనాలి అనే గ్రామం — గ్రామం కాదు, పట్టణంకాదు — ఉదయం—అరుణోదయు మయింది—పట్టణం నిశ్శబ్దంగా ఉన్నది—ఏమిటిది? ఒకరూ లేవలేదు—సంధ్యానుష్ఠానాదులు లేవు—వేదపాఠం వినపట్టమే లేదు—ఊఁ—ఉత్తరపువేపున ఒక యింట్లో—కొన్ని బోడివి ఇళ్ళు—ఒక యింటిమీద యింకోటి—గృహశాస్త్ర నిబంధనలను అన్నిటిని ధ్వంసం చేశారు. ఆమూల దీపందగ్గిర ఒక వటువు చదువుతున్నాడు—ఏమంటున్నాడు?—

'అక్బర్ వజ్ ఏ గ్రేట్ రూలర్.' అంటే ఏం భాష అది?

ఆ కుర్రాడి జుట్టేమిటి అట్టా వుంది? ముందు వెంట్రుకలూ—వెనక పొట్టీ—ఛీ. ఛీ. దంతధావన మన్నా చేయలేదు. ఉండు. ఏమి టా శబ్దం? వూరి మధ్యగా ఏదో ఇనుపకమ్ములమీద దొర్లుతో, పొడుగ్గా, రాక్షసివలె నల్లని పొగలు చిమ్ముతో వొస్తోంది. ఏదో పాపం! ఈ పట్టణంమీదికి వొచ్చింది. పొడుగ్గా పామువలె వుంది. కీచుమని కూసింది. అంత పెద్దజంతువుకి అంత సన్నని కంఠమేమిటి? బ్రహ్మకి ఆనాటికి వెర్రెత్తుతుందిగావును! దాని పొట్టలో మను షులు, తలలో తోకలో—రామ రామ, ఎందర్ని మింగిందో! నిప్పులు కక్కుతోంది. ఆ పొట్టలో తోకలో అన్నీ మంటలే—అరే—మనుషులు బతికే వున్నారయ్యా! దాని పొట్టకి కిటికీలు—చూస్తు న్నారు బైటికి. ఆగింది—దూకుతున్నారు. పొట్టచించు కుని దూకుతున్నారు. పెట్టెలు—పరుపులు—ఎట్లాంటి మృగం? సాధువు—మచ్చికయింది. పాపం—అరే! అరే! తల వూడి దూరంగా పోతోంది—సామాన్లు పట్టుకుని వొంతెన దాటి పోతున్నారు. అక్కడ రథాలూ, బళ్ళూ—ఇదేమిటి, బళ్ళు అట్లావున్నాయి? ఒకడు రథంలో యెక్కుతున్నాడు. వాడి బట్టలు వింతగా వున్నాయి. అన్నీ వేరుగా వున్నాయి. నెత్తి మీద పళ్ళెమంటి తలపాగా పెట్టాడు. మెళ్ళో పీలిక కట్టుకున్నాడు. రథంలో కూచుని పెట్టెలోంచి ఒక

పుల్ల గీసి అగ్గిని పుట్టించి—నోట్లో అదేమిటి? ఒక గొట్టం—దాన్ని వెలిగించి పొగ వొదులుతున్నాడు. ఎందుకు? వీడే కాదు, చాలామందికి వున్నాయి అట్లా. కొందరికి నల్లటిపుల్లలు, కొందరికి తెల్లటివి. అన్నీ కాలుతున్నాయి—పొగలు వొస్తున్నాయి. ఏం ఆచారమో అది? ఆ రథం అట్లా వుందేం? గుర్రాలు లేవు, యేమీ లేవు—పెద్ద అరుపు అరిచి ఘూర్ణిల్లుతోంది, సాగింది ముందుకు. అరే అదేదో మృగం, భూతం. వెనక ధూమాలు వెదచిమ్ముతోంది. పోయింది. పోయింది, దూరంగా - వీళ్ళలో కొందరు ఒక యింటో దూరుతున్నారు.- బల్లల మీద గిన్నె లున్నాయి. తింటున్నారు. విస్తళ్ళలో కుడుములు, గిన్నెల్లో ఏదో పానీయము—వేడిగా పొగలు వొస్తోంది. తెల్లవారక ముందే-స్నానం, సంధ్య, కర్మ, అగ్నిహోత్రం ఏమీ లేవే - ఆ! బ్రాహ్మలే ఆ వొడ్డించేవాళ్ళు. అన్ని కులాలూ తింటున్నారు. ఆ మ్లేచ్ఛుడు-ఆ శూద్రుడు-అందరూ ఒకచోటే - ఒక పాత్రలోనే - ఛీ ఛీ, ఇంక చూస్తే నరకం వస్తుంది. పోనీ.

సాయంకాలం చూద్దాము- ఆ...సాయంత్రం ...పెద్ద వీధిలో గుంపు. ఒకడు ఉపన్యాసమిస్తున్నాడు. చాలా పెద్దగుంపు-అదేమిటీ? ఇంకోరథం. చాలా పెద్దది ఆగింది. గుంపులో కలవరం. గుంపులో చాల మంది ముతక బట్టలు వేసుకున్నారు. తెల్లటి టోపీలు-వీరెవరో, యేదో ఆశ్రమంవారేమో! ఏదన్నా క్రొత్త మతమో! పాపం! పాపం! ఆ రథంలోంచి

ఆయుధపాణులై దిగారు. శత్రు రాజులేమో! లేక రాజభటులా! కొడుతున్నారు. కర్రలతో మోదు తున్నారు, ప్రజల్ని. చాలమంది పరిగెత్తారు. కాని ఆ తెల్లటోపీల వాళ్ళు నుంచునే వున్నారు. రామ భజన చేస్తున్నారు. దెబ్బలు తింటోనే. ఒకడి చేతులో జెండా వుంది. దాన్ని వొదలడు-హరి హరి! ఎట్టా కొట్టారో! జండా వదలకుండా అట్టానే పడిపో యాడు కింద. తిరిగి కొట్టరే! అయ్యో! యెంత దుర్గ తికి వొచ్చారు! క్షాత్రం ఎంత నశించింది! పర సైన్యాలనించి రక్షించుకోరే! భారతసంతతి యెంత హీనదశకు వచ్చింది! కాదయ్యా! వుండు. కాదయ్యా! లేదు. ఒక్కడూ పరిగెత్తలేదు. 'రామ! రామ' అంటు న్నారు. ఆ కళ్ళల్లో శాంతం, దయ! ఏమీ భీతి లేదు. ఎంత అహింస! ఎంత క్షమ! ఆహా! వీరందరూ తాపసులయ్యా! కలికాలపు రుషులు, యీ వేషా లలో వున్నారు.

అదిగో సన్యాసి వొస్తున్నాడు ఒకడు. ఇంక యీ యుద్ధాన్ని మాన్పుతాడు. లేదు—ఒక్కడూ నమస్కరించడే! తోసేస్తున్నారు. ఏమిటయ్యా యీ కాలం?

కాని యెంత ధర్మం వుందయ్యా? ఒక్కపాద మేమిటి? వర్ణాలు, ఆశ్రమాలు నశించాయి. సర్వ కర్మలూ, ఆచారాలూ విధ్వంసమైనాయి. కాని యెంత క్షమ! యెంత శాంతం! యీ కర్మలు, యీ కులాలు పోతే నేమయ్యా, అట్లాంటి కర్మయోగులున్నతర వాత!

టోపీలవాళ్ళని లాక్కుపోతున్నారు. మరి వీళ్లు పరరాజభటులయితే యీ పట్టణంలో రాజభటులు లేరే! కాదు, వీళ్లు రాజభటులు. యీ తెల్లటోపీల పురుషులు ఈ రాజుకు వ్యతిరేకమైన మతప్రచారం చేయడంచేత వారిని హింసిస్తున్నారు. ఆ దండనాధికారి దగ్గిరికి తీసుకువెళ్ళారు. ఆ టోపీలు లాగేసి పొమ్మన్నాడు. గాయాలు తగిలినవాళ్ళని తీసుకెళ్ళారు. అది వైద్యాలయం గావును, కట్లు కడుతున్నాడు—అక్కడే పడుకోపెట్టారు. ఎంతశుభ్రంగా వుందో యీ ఆలయం? ఎన్ని మందులు, ఎందరు రోగులో! అబ్బా! ఎటువంటి రోగాలో! ఎంత పాపం పెరిగింది! మనుష్యుల్లో ఆచారమూ, శుచీ నశించి రోగా లెక్కువైనాయి. ఈ పట్టణం యెంత అశుభ్రంగా వుందని! కాని యీ వైద్యు లెంతమంచివాళ్ళో! రాజవిరోధుల్ని యెంత ఆదరిస్తున్నారో! పాపం యీ రాజభటులో! అప్పుడు కొట్టారేగాని యెంత దయగా మాట్లాడుతున్నారు! యెంత మంచి ప్రభుత్వమయ్యా! మనకాలంలో ఐతే ఒక్క నిమిషములో తలలు తీసేస్తారుకద! విరోధుల్ని కూడా యింతదయగా ఆదరణచేస్తాడే యీ ప్రభువు! ధర్మం లేకపోలేదయ్యా!

మిగిలిన తెల్లటోపీలవాళ్లు యిళ్ళకి పోతున్నారు. రాత్రయింది. దీపాలు వెలిగించారు. తెల్లగా వెన్న ముద్దలమల్లే వెలుగుతున్నాయి, ఆదీపాలేమిటి? యెంత వెలుతురో! వీడెవడో నల్లటివాడు, పెద్దమీసాలవాడు, తెల్లటోపీవాడు యిట్టానే వెళ్లుతున్నాడు యింటికి—

చూద్దాం—ఆమె అతని భార్యగావును. పిల్ల నెత్తుకు వొచ్చింది. భర్తకు నమస్కరించనన్నా నమస్కరించదు. భక్తిలేదే! మాటల్లో, చూపులలో తృణీకరిస్తోంది; తిడుతోంది భర్తనే. కొట్టాడు. ఆమెను బైటికి యీడ్చాడు, ఆ బిడ్డతోసహా. యిందాక ఆ రక్షకభటులముందు ఆశాంత మేమిటి? నిజమైన శాంతభావ మబ్బలేదయ్యా! అసహనమంతా ఆ బహిరంగ సభలోనే! ఆ అబలను - స్త్రీని ఆ శిశువుతోకూడా గెంటి తలుపువేశాడు. లోపల భోజనం ఒడ్డించుకున్నాడు. పాదాలన్నా కడుక్కో లేదు. స్నానం, అర్చనం, అగ్నిపూజ-ఛాఁ! పాడుగృహం-ఎక్కడా ఒక్క దేవతా పటమైనా లేదు. పాప మామె వీధిలోనే నిలుచొని ఏడుస్తోంది. తోవబొయ్యేవాళ్లు యెవ్వరూ విచారించరు. బిడ్డ యేడుస్తోంది. వాడి భోజనమయింది. అంతా అట్లానే వొదిలి, తలుపుతీసి, వెడుతున్నాడు వీధి వెంబడి. పాపం, ఆమె భయంతో లోపలకు వచ్చింది. వెదుకుతూంది. బిడ్డకైనా యేమీ లేదు, తినడానికి. అంతా తిన్నాడు. పడుకుంటోంది యేడుస్తో, వాడో ఆ తెల్లటిపుల్లలు కొని వెలిగించి పొగ వూత్తో పోతుతున్నాడు. ఇదయ్యా కలియుగం. చాలునా?